ప్రశాంతంగా డిఎస్‌సి పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా డిఎస్‌సి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం ఐదు సెంటర్లలో, మధ్యాహ్నం నాలుగు సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ శాఖ 144వ సెక్షన్‌ను అమలు చేశారు. స్థానికంగా ఉండే జిరాక్స్ సెంటర్లను మూసి వేయించారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించి కేంద్రంలోనికి అనుమతించారు. అభ్యర్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. హాల్ టికెట్‌ను పరిశీలించి లోనికి అనుమతించారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా యంత్రాంగం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. ఉదయం 936 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 862 మంది హాజరయ్యారు. 74 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 845 మంది హాజరు కావాల్సి ఉండగా 722 మంది హాజరయ్యారు. 123 మంది గైర్హాజరయ్యారు. అధికారులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

టీచర్ల బదిలీల్లో గందరగోళం

ఉపాధ్యాయ బదిలీల్లో గందరగోళం నెలకొంది. ఉమ్మడి కడప జిల్లాలో ఒకేచోట ఐదేళ్లు, ఎనిమిదేళ్లు సర్వీసులు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు బదిలీ తప్పనిసరి. ప్రభుత్వం బదిలీలకు మార్గదర్శకాలను విడుదల చేసింది. సీనియారిటీ ప్రాతిపదికన పలువురు ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఎంపిక చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఎంపిక చేసుకున్న బదిలీల్లో పాఠశాల విద్యాశాఖ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందనే విమర్శ వినిపిస్తోంది. ఉదాహరణగా సబ్జెక్టు ఉపాధ్యాయ పోస్టు లేని హైస్కూల్‌కు సబ్జెక్టు ఉపాధ్యాయుడిని బదిలీ చేయడం దగ్గర నుంచి ఆప్షన్లు ఎంపిక చేసుకున్న ఉపాధ్యాయులను రిజర్వ్‌లో ఉంచడం, కొంతమందిని ఎంపిక చేసుకున్న పాఠశాలలకు గాకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో బదిలీల్లోని డొల్లతనం బయటపడిందనే వాదన వినిపిస్తోంది.

పోస్టు లేని చోటికి స్పెషలిస్టు టీచర్!
ఆప్షన్లు విస్మరించి ఇష్టారాజ్యంగా బదిలీలు
స్పౌజ్ బదిలీల్లో పారదర్శకతకు పాతర

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ క్లైమాక్స్‌కు చేరుకుంది. సుమారు 6,500 మంది ఉపా ధ్యాయుల బదిలీ ప్రక్రియ నడు స్తోంది. 2,500 మంది స్కూల్ అసిస్టెంట్లలో 164 మందికి ప్రమోషన్, 3,900 మంది ఎస్‌జిటిలు, 91 మంది ప్రధానో పాధ్యాయులు ఉన్నారు. ఐదేళ్ల స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జిటిలు, ఎనిమిదేళ్లునిండిన ప్రధానోపాధ్యాయులు బదిలీలకు అర్హులు. తొలి విడత కింద 91 మంది ప్రధానోపాధ్యాయుల బదిలీలను పూర్తి చేసింది. రెండవ విడత కింద ఈ నెల ఒకటి, రెండు తేదీల్లో 2,500 మంది స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు చేపట్టాల్సి ఉంది. ఆలస్యంగానే స్కూల్ అసిస్టెంట్ల బదిలీలకు పాఠశాల విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. గురువారం స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ఆప్షన్ విడుదల చేసింది. సంబంధిత స్కూల్ అసిస్టెంట్లు ప్రొఫెషన్స్, జనరల్ కేటగిరీల ప్రాతిపదికన బదిలీ ప్రాంతాలను ఎంపిక చేసుకున్నారు. పాఠశాల విద్యాశాఖ ఇష్టారాజ్యంగా బదిలీలు చేసింది. సంబేపల్లి మండలం శెట్టిపల్లి హైస్కూల్‌కు ఇంగ్లీష్ సబ్జెక్టు నిపుణుడిని బదిలీ చేసింది. అక్కడ ఇంగ్లీష్ బోధించే పోస్టు లేకపోవడంతో తిరుగు ముఖం పట్టాల్సి వచ్చింది. కొంతమంది ఉపాధ్యాయులు ఎంపిక చేసుకున్న హైస్కూళ్లకు బదిలీలు చేయకుండా, ఇతర ప్రాంతాలకు చెందిన పాఠశాలలకు బదిలీలు చేశారు. ఉదాహరణ కడప నగరంలోని బుచర్ స్ట్రీట్‌కు చెందిన ఉర్దూ హైస్కూల్ స్థానాన్ని ఎంపిక చేసుకున్న మహిళా టీచర్‌ను ఎంపిక చేయని హైస్కూల్‌కు బదిలీ చేయడం గమనార్హం. పిఇటిల బదిలీలకు సంబంధించి కడప ఉర్దూ హైస్కూల్‌ను ఎంపిక చేసుకున్నప్పటికీ చాలా మందికి ఇతర పాఠశాలలు కేటా యించడం చర్చనీయాంశంగా మారింది. స్పౌజ్ ఉద్యోగుల బదిలీల విష యంలోనూ ఇష్టారాజ్యంగా వ్యవహ రించడాన్ని గమనిస్తే పాఠశాల విద్యాశాఖ తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే వాదన ఉపా ధ్యాయ సంఘాల నుంచి వినిపిస్తోంది. 48 మంది మ్యాథ్స్ సబ్జెక్టు ఉపాధ్యాయులు, 24 మంది ఇంగ్లీష్ సబ్జెక్టు నిపుణులు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఎంపిక చేసుకున్నప్పటికీ రిజర్వ్‌లో ఉంచడం చర్చనీయాంశంగా మారింది. పలువురు సర్‌ప్లస్ ఉపాధ్యాయుల బదిలీల అంశంలోనూ గందరగోళ వాతావరణం కనిపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాలోని ఉపాధ్యాయుల బదిలీల విషయంలో పారదర్శకంగా వ్యవహరించడంలో తొట్రుపాటు కనిపిస్తుందనే వాదన పెద్దఎత్తున వినిపిస్తుండడం గమనార్హం.

ఇష్టారాజ్యంగా బదిలీలు

ఉపాధ్యాయ ఆన్లైన్ బదిలీలు ఇష్టారాజ్యంగా, గందరగోళంగా తయారయ్యాయి. పోస్టులు లేని చోటికి కూడా ఆర్డర్లు కేటాయించడం, పిఇటి ఉపాధ్యాయులు ఎంపిక చేసుకున్న ప్రాధాన్యత స్థానాలు ఖాళీగా ఉన్న వాటిని కేటాయించకుండా వేరే స్థానాలు కేటాయించారు. ముందస్తు ప్రణాళిక లేకుండా అధికారులకు ఇష్టమొచ్చిన రీతిలో బదిలీలు నిర్వహించారు.

-పాలెం మహేష్ బాబు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

లేబర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

జిజిహెచ్‌లో పనిచేస్తున్న శానిటేషన్ సూపర్‌వైజర్, ఇద్దరు సెక్యూరిటీ గార్డ్స్‌ను అకారణంగా తొలగించడాన్ని నిరసిస్తూ, కార్మికులను ఇబ్బందులు గురిచేస్తున్న సుబ్బరాయుడు, బాలనారాయణరెడ్డిని అరెస్ట్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో లేబర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ముఖ్యంగా డిప్యూటీ సీఎం రిమ్స్‌కు వచ్చినప్పుడు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎ1, ఎక్స్‌పోర్ట్ యాజమాన్యం అని చెప్పుకుంటున్న సుబ్బరాయుడు, బాల నారాయణరెడ్డి కార్మికులను తొలగించడం దుర్మార్గమని చెప్పారు. సమస్యలు ఉంటే అధికారులకు చెప్పుకోవడం ఆనవాయితని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో డిప్యూటీ సిఎంకు వినతి పత్రం అందజేశారని తెలిపారు. తొలగించిన కార్మికులను విధులకు తీసుకోవాలని అనేకసార్లు డిప్యూటీ కలెక్టర్‌కు, కలెక్టర్‌కు, జెసికి వినతి పత్రాలు అందజేశామన్నారు. జిల్లా అధికారులు స్పందించినా మేనేజ్‌మెంట్ పరిధిలో సబ్ కాంట్రాక్ట్ ర్ స్పందించకపోవడం దారుణమని చెప్పారు. తప్పని పరిస్థితుల్లోనే ఆందోళన నిర్వహించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా చెల్లించడం లేదని ఆరోపించారు. 549 ప్రకారం రూ.16వేలు ఇవ్వాల్సి ఉండగా కొందరికి రూ.10వేలు, మరికొందరికి రూ.12,403 మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు. ఇచ్చే వేతనంలో కార్మికుల ద్వారానే ఇఎస్ఐ, పిఎఫ్ మొత్తం డబ్బులు కట్ చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాల పైన అనేకసార్లు రిమ్స్ మేనేజ్మెంట్ దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. స్పందించకపోగా కక్షపూరితంగా కార్మికులను ఇబ్బంది పెట్టడం సరెంది కాదన్నారు. తొలగించిన శానిటేషన్ సూపర్‌వైజర్‌ను, ఇద్దరు సెక్యూరిటీ గార్డ్స్ ను విధులకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు. విధులకు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం లేబర్ అధికారికి వినతిపత్రం అంద జేశారు. ధర్నాలో సిఐటియు నగర అధ్యక్ష, కార్య దర్శులు పి. వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి, మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి గోపి, కిరణ్, పవన్, మహేష్, హరి, ఇమాం, నరేంద్ర, నారాయణరెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు.

ప్రమాదకర గర్భిణులకు
సకాలంలో చికిత్స అందించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో డాక్టర్ కె. నాగరాజు అధ్యక్షతన పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులకు శుక్రవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అధిక ప్రమాదకర గర్భిణులను గుర్తించి సకాలంలో సరిన సమయంలో చికిత్స చేయించాలని డాక్టర్ నీలిమ అసిస్టెంట్ ప్రొఫెసర్ రిమ్స్ సూచించారు. డిఐఒ డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, వ్యాధి నిరోధక టీకాల వల్ల సంభవించే ప్రమాదాలను గుర్తించి వాటిని రికార్డు చేసుకుని పై అధికారులకు తెలపాలని సూచించారు. సరైన చికిత్స చేయాలని కోరారు. డాక్టర్ వెంకట రాముడు మానసిక ఆరోగ్యం గురించి వైద్యాధికారులకు తెలిపారు. డాక్టర్ హీరేంద్ర అతిసారా వ్యాధి గురించి, ఒఆర్ఎస్ ద్రావణం ఎలా తయారు చేసుకోవాలో తెలియజేశారు.

అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఇ

సోలార్ రూఫ్ టాప్ లక్ష్యం చేరుకోవాలి

- జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ

ప్రజాశక్తి - కడప

లక్ష గృహాల సోలార్ రూఫ్ టాప్ లక్ష్యం చేరుకోవాలని కడప జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు లక్ష గృహాల సోలార్ రూఫ్ టాప్ లక్ష్యంలో భాగంగా శుక్రవారం వైఎస్ఆర్ కడప జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎస్. రమణ ద్యుత్ భవన్‌లోని తన ఛాంబర్‌లో బ్యాంకర్స్, అధికారులు, సంస్థాపన వెండర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు నిర్దేశాలు సులభతరం చేశామని, ప్రజలలో అవగాహన పెంచాలని నిర్దేశించారు. బ్యాంకర్ల సహకారాలు మెండుగా ఉన్నాయి అన్నారు. సిబిల్ స్కోర్‌ను బట్టి బ్యాంకులు రుణాలు వేగ వంతంగా ఇస్తారని తెలియజేశారు. ఒక్క కిలో వాట్ కెపాసిటీ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే నెలకు 120 యూనిట్ల విద్యుత్తుని, అదే రెండు కిలోవాట్ల కెపాసిటీ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే 240 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తుంది అన్నారు. ఈ విద్యుత్ ద్వారా గృహ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను గణనీయంగా తగ్గించుకోవడమే కాకుండా తిరిగి మిగులు విద్యుత్ యూనిట్‌కు రెండు రూపాయల తొమ్మిది పైసలు వంతున పొందవచ్చని తెలియజేశారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీల పొంది సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు సబ్సిడీ పోను పెట్టిన పెట్టుబడి వ్యయం తక్కువ సమ యంలో తిరిగి వస్తుందని తెలియజేశారు. రానున్న కాలంలో విద్యుత్ వాహనాల ప్రాధాన్యత అధికంగా ఉంటుంది కావున వీటికి అవసరమైన విద్యుత్ శక్తి సోలార్ రూఫ్ టాప్ ద్వారా పొందవచ్చని తెలిపారు. సమావేశంలో బ్యాంకర్స్ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జి.జనార్దన్, నెడ్ క్యాప్ డెవలప్మెంట్ ఆఫీసర్ యల్లారెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ మల్లికార్జున, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మధుసూదన్ పాల్గొన్నారు.

14,15న 'యుఇఇయు' రాష్ట్ర మహాసభలు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న యుఇఇయు నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (యుఇఇయు) రాష్ట్ర 11వ మహాసభలు ఈ నెల 14, 15 తేదీల్లో గుంటూరులో నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుదర్శన్‌రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనురు శ్రీనివాసులురెడ్డి, డిస్కం అధ్యక్షులు శివశంకర్, రాష్ట్ర నాయకులు నాయబు రసూల్, వెంకటరమణ తెలిపారు. శుక్రవారం నగరంలోని సిఐ టియు జిల్లా కార్యాలయంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థల పరిరక్షణ, ఉద్యోగులు, కార్మికుల హక్కుల రక్షణకోసం తమ యూనియన్ నిరంతరాయంగా పోరాడుతోందని తెలిపారు. 1989లో యూనియన్ ఆవిర్భావం నుంచి విద్యుత్ సంస్థల్లోని రెగ్యులర్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేశామని చెప్పారు. కాంట్రాక్టు కార్మికులను, గ్రామ ఎలక్ట్రిసిటీ వర్కర్లను పోరాటాల ద్వారా రెగ్యులర్ చేయించామని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులకు అనేక చట్టబద్ధమైన హక్కులను సాధించామని వెల్లడించారు. వినియోగదారుల ప్రయోజనాలకు విఘాతం కలగకుండా ప్రభుత్వ రంగంలోనే విద్యుత్ సంస్థలు కొనసాగించాలని పోరాటాలు చేస్తున్నామని పేర్కొన్నారు. సంస్థకు, ఉద్యోగుల భవిష్యత్తుకు నష్టదాయకమైన విద్యుత్ ప్రయివేటీకరణ విధానాలు, పెరుగుతున్న ఉద్యోగుల సమస్యలు, పెండింగ్ డిఎలు, పిఆర్‌సి, కారుణ్య నియామకాలు, ఇపిఎఫ్, హయ్యర్ పెన్షన్, కన్వర్షన్స్, మెడికల్ పాలసీ, జెఎల్ఎం గ్రేడ్-2 దీర్ఘకాలిక సమస్యలపై మహాసభలో తీర్మానాలు చేస్తామని తెలిపారు. భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. మహాసభను జయప్రదం చేయాలని విద్యుత్ ఉద్యోగులు, కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.నాగ సుబ్బయ్య, శ్రీహరి, కోశాధికారి సురేంద్ర, కార్యవర్గ సభ్యులు శివప్రసాద్, నాగ మల్లయ్య, లెనిన్ బాబు, బండి రామ్మోహన్, రామలింగారెడ్డి, సుబ్బారెడ్డి, సుబ్బరాయుడు, పి.ప్రసాద్ పాల్గొన్నారు.

టిడిపి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి

- పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

తెలుగుదేశం పార్టీ అధికారంలోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని వైసిపి రాష్ట్రంలో అభివృద్ధి నిర్వీర్యం చేసి పాలన సాగించిందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ద్వారకా నగర్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హంద్రీనీవా పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల పూర్తికి జగన్ ఒక తట్ట మట్టి ఎత్తలేదని, ఒక్క రూపాయి ఖర్చు చేయలేదని పేర్కొన్నారు. ప్రాజెక్టులపై నిర్లక్ష్యాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రజలను మభ్య పెట్టటానికి వేలకోట్ల అభివృద్ధి పనులకు జీవోలు మాత్రం ఇచ్చారన్నారు. పారిశ్రామిక హబ్‌గా కొప్పర్తికి మహర్దశ తెచ్చింది చంద్రబాబు అన్నారు. ఉక్కు పరిశ్రమకు చంద్రబాబు భూమి పూజ చేస్తే, జగన్ మరొకచోట భూమి పూజ చేసి నిర్మాణాన్ని గాలికి వదిలేసి, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతను మోసం చేశారని చెప్పారు. ఉక్కు పరిశ్రమ నిర్మాణం జిందాల్ చేపడుతుందని చెప్పారు. మూడేళ్లలో పూర్తి చేసి, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. కడప దాహార్తిని శాశ్వత పరిష్కారం కోసం రూ.500 కోట్లతో బ్రహ్మ సాగర్ నుంచి నీటిని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ క్రమ పద్ధతిలో అమలు చేస్తామని, దేశంలో నాలుగు వేలు పెన్షన్ అమలు కాలేదని, ఒక్క ఏపీలోనే అమలవుతుందని అన్నారు. ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తూ ఉంటే, దగా రోజు నిర్వహిస్తారా అని వైసిపి నేతలను ఆయన ప్రశ్నించారు. దశల వారీగా మద్యనిషేధం ఏమైందని, మద్యాన్ని ఏరులై పారించి, మట్టి, ఇసుక, సహజ వనరులను లూటీ చేశారని మండిపడ్డారు. విసిగి, వేసారిన ప్రజలు కూటమికి 106 సీట్లు ఇచ్చి, వైసిపికి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదన్నారు. మునిగిపోయిన వైసిపి ఉనికి కోసం ఎగిరి పడితే, ఒక్క సీటుకే పరిమితం అవ్వడం ఖాయమని హెచ్చరించారు.

ఫ్లోరైడ్ రహిత నీటిని అందించడమే లక్ష్యం

- కేంద్ర ప్రభుత్వ నోడల్ అధికారి ముఖేష్ మెగ్వాల్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

కార్యక్రమంలో నోడల్ అధికారి ముఖేష్‌మెగ్వాల్

గ్రామీణ ప్రాంత ప్రజలకు ఫ్లోరైడ్ రహిత మంచినీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర నోడల్ అధికారి, ఫర్టిలైజర్స్ డిప్యూటీ సెక్రటరీ ముఖేష్ మెగ్వాల్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గురజాలలో వాటర్ గిడ్ స్కీంపై క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఫ్లోరైడ్ రహిత నీటిని అందించాలనే లక్ష్యంతో పులివెందుల నియోజకవర్గంలో రూ.480 కోట్లు వ్యయంతో వాటర్ గ్రిడ్ పనులను ప్రారంభించారని చెప్పారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం జల జీవన మిషన్ కింద విరివిగా నిధులను కేటాయించారని పేర్కొన్నారు. ఈ నిధులను క్షేత్రస్థాయిలో సరైన విధంగా వినియోగించుకోవాలని సూచించారు. కేంద్ర శానిటేషన్ అండ్ డ్రింకింగ్ వాటర్ టెక్నికల్ అధికారి నవనీత్ ఉపాధ్యాయ మాట్లాడుతూ వాటర్ గ్రిడ్ పనుల పట్ల సంతోషం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పనుల నిర్వహణలో ఎన్నో అవాంతరాలు ఎదురైనప్పటికీ పనులను దాదాపు పూర్తి దశకు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఈ పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు అంకితం చేయాలని సూచించారు. అనంతరం ఫ్లోరైడ్ నీటి కిట్టును వైద్య శాఖ అధికారులు చూపించి వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఏడుకొండలు, ఇఇ విజయభాస్కర్, డిఇ ఇక్బాల్, మెగా కంపెనీ ప్రతినిధి రవికుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎవలు, గురజాల సర్పంచ్ రామ శేఖర్, వైసిపి నాయకులు కరుణాకర్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు, రేపు శిల్పారామంలో సాంస్కృతిక సంబరాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న కృష్ణప్రసాద్

బక్రీద్ పండగ పర్వదిన సందర్భంగా డ్రీమ్ మీడియా సుజాత వారి సహకారంతో కడప శిల్పా రామంలో సాంస్కృతిక సంబరాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరి పాలన అధికారి ఎస్ కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం శిల్పారామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శని వారం బక్రీద్ సందర్భంగా సాయంత్రం 6 గంటల నుంచి 8.30 గంటల వరకు ప్రముఖ నృత్య కళాకారులైన విజయశాంతిచే సాంస్కృత కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఆదివారం జబర్దస్త్‌లోని ఆర్టిస్ట్‌లు కడప శిల్పారామానికి వస్తున్నారని చెప్పారు. జబర్దస్త్ కామెడీ స్కిట్లుతో పాటు ప్రేక్షకులకు ఆహా అనే విధంగా డాన్స్‌లు ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలు హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

ఎల్‌ఎల్‌బి సెమిస్టర్ల పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి- కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఎల్‌ఎల్‌బి 3,5 సంవత్సరాల, 5, 7, 9 సెమిస్టర్ల పరీక్షల ఫలితాలను రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు, అకడమిక్ డీన్ ఆచార్య చంద్ర ఓబుల రెడ్డి శుక్రవారం పరిపాలన భవనంలో విడుదల చేశారు. ఐదేళ్ల ఎల్‌ఎల్‌బి మూడో సెమిస్టర్ 81 శాతం ఫలితాలు, ఐదో సెమిస్టర్‌లో 76శాతం ఫలితాలు, ఏడో సెమిస్టర్‌లో 61 శాతం, తొమ్మిదో సెమిస్టర్ లో 91.67 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వివరించారు. ఎల్‌ఎల్‌బి మూడు సంవత్సరాల కోర్సు 3వ సెమిస్టర్‌లో 23.81 శాతం, 5వ సెమిస్టర్‌లో 88.24 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. పరీక్ష ఫలితాలను సకాలంలో విడుదల చేసిన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ విభాగాన్ని రిజిస్ట్రార్ అభినందించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సమ్మర్ క్యాంపు ముగింపు వేడుకల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ మాట్లాడుతూ సమ్మర్ క్యాంపు ఏప్రిల్ 28 నుంచి జూన్ 6 వరకు నిర్వహించినట్లు పేర్కొన్నారు. క్యాంపులో యోగా, స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్, మోటివేషన్ క్లాస్, ఇండోర్ గేమ్స్, బేసిక్ మాథ్స్, క్యూబ్ గేమ్, డాన్స్ లో విద్యార్థులు ఎంతో ఉత్సాహం పాల్గొన్నారని తెలిపారు. సమ్మర్ క్యాంపునకు విద్యార్థులను పంపిన తల్లిదండ్రులకు, రిసోర్స్ పర్సన్స్‌గా వచ్చి ఉచితంగా విద్యార్థులకు భోదించిన టీచర్స్ కు, జనవిజ్ఞాన వేదిక నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ భారతి, డిప్యూటీ లైబ్రేరియన్, పవన్ కుమార్, లైబ్రేరియన్ జేమ్స్, సురేష్, సిబ్బంది రమణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో మండలాభివృద్ధి : ఎంపిపి

- మండల సమావేశంలో శ్రీరామ ఎత్తిపోతల పథకానికి పెద్దపీట

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

మాట్లాడుతున్న ఎంపిపి లక్ష్మీదేవి

అందరి సహకారంతో మండలాభివద్ధికి కృషి చేయాలని ఎంపిపి లక్ష్మీదేవి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభాభవనంలో శుక్రవారం ఎంపిపి అధ్వర్యంలో మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. అజెండా ప్రకారం ఆయాశాఖల అధికారులు పురోగతి, సమస్యలపై మాట్లాడాలని ఎంపిడిఒ గౌస్‌బాష పేర్కొన్నారు. ముందుగా ఉపాధి ఎపిఒ శంకర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో 5610 జాబ్ కార్డులుండగా 7,452 మంది సభ్యులు ఉన్నారని తెలియజేశారు. వీరందరూ కూడా రెండు నెలలుగా పని చేస్తున్నారని మండలంలో అర్హులందరికీ పనులు కల్పించామని చెప్పారు. ఒక్కో కూలీకి రూ. 265 చెల్లిస్తున్నామన్నారు. అనంతరం స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మయ్య మాట్లాడుతూ అధికారులందరూ కూడా ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం కచ్చితంగా ఇవ్వాలని, వారికి అన్ని విషయాలు అవగాహన కలిగేటట్లు సమాచారం ఇవ్వాలని కూడా ఆదేశించారు ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా ప్రజలకు అర్థమయ్యేటట్లు తెలియజేయాలని చెప్పారు. ఇరిగేషన్ ఎఇ సాయి కిషోర్ మాట్లాడుతూ శ్రీరామ ఎత్తిపోతల పథకానికి మైనర్ రిపేర్లు కోసం రూ. 16 లక్షలు తాత్కాలికంగా విడుదుల చేశామన్నారు. పథకానికి శాశ్వత పైప్‌లైన్ కోసం పూర్ణోదయ స్కీం కింద రూ. 15 కోట్లు ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలియజేశారు. ఇదే పూర్ణోదయ స్కీం కింద ఒంటిమిట్టచెరువుకు గంగ పేరూరు చెరువుకు మంటపంపుల చెరువుకు మర్మతుల కోసం ప్రతిపాదనలు పంపామని చెప్పారు. అనంతరం వెటర్నరీకి డాక్టర్ మాట్లాడుతూ పశువులకు ఎల్ఐసి చేసుకోవచ్చని తెలియజేశారు పశువులకు ఎలాంటి జబ్బులు వచ్చినా వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. ఎంఇఒ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పిల్లలు సంబంధించి విద్యార్థులకు సంబంధించి అన్ని కిట్లు వచ్చాయని చెప్పారు. పాఠశాలలు తెరవగానే పిల్లలకు అందజేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఎందుకు ఉత్తీర్ణత శాతం తగ్గిందని కొంతమంది ప్రజాప్రతినిధులు, సభ్యులు ఎంఇఒను ప్రశ్నించారు. ఆయన నుంచి సరైన సమాధానం రాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఒంటిమిట్ట పెద్ద చెరువు ఆయకట్టు చైర్మన్ పాటూరు గంగిరెడ్డి మాట్లాడుతూ ఒంటిమిట్ట చెరువుకు అభివృద్ధికి ఇరిగేషన్ శాఖ ఎలాంటి చర్యలు తీసుకోలేదని సభాముఖంగా ఇరిగేషన్ ఎని ని అడిగారు అందుకు ఇరిగేషన్ ఏ ఈ సమాధానం ఇస్తూ ఒంటిమిట్ట చెరువు అభివృద్ధి కోసం కొన్ని పర్యాటక సంబంధించి టిటిడి వారు చర్యలు తీసుకున్నట్లు ఆయన సమాధానం ఇచ్చారు అనంతరం ఆయా శాఖలకు సంబంధించిన అధికారులుతమశాఖలకు సంబంధించి అభివృద్ధి పనులు వివరించారు. కార్యక్రమంలో మాజీ కో- ఆప్షన్ సభ్యులు అజ్మత్‌బాషా, మంటపంపల్లి ఎంపిటిసి సుంకేసులబాషా, ఒంటిమిట్ట చెరువు ఆయకట్టు వైస్ చైర్మన్ కట్టా యానాదయ్య, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప నియోజకవర్గలో సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.12,99,807 విలువైన 18 చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే మాధవి, పొలిట్ బ్యూరో సభ్యులు, కడప జిల్లా టిడిపి జిల్లా అధ్యక్షులు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి అందజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలిచేలా సిఎం రిలీఫ్ ఫండ్‌ను ప్రజల కోసం ప్రభుత్వం వినియోగిస్తుందని తెలిపారు. ప్రభుత్వం ప్రజాక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని చెప్పారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - కడప : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని యోగా శిక్షకులు పేర్కొన్నారు. శుక్రవారం యోగాంధ్ర-2025 మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలోని వివిధ మండలాలలో యోగ శిక్షణా తరగతులు నిర్వహించారు.ఈ నెల 21 నుండి జూన్ 21 వరకు యోగాంధ్ర 2025 ప్రాముఖ్యతపై రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగా జిల్లాలో వివిధ మండలాలు గ్రామాల్లో శిక్షణ తరగతులు నిర్వహించారు.

మాట్లాడుతున్న వరద కిషోర్‌రెడ్డి

బక్రీద్ రోజు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

బక్రీద్ పర్వదినం రోజు ముస్లిములు ప్రభుత్వ నిబంధనలు పాటించి ప్రశాంత వాతావరణంలో పండుగ నిర్వహించుకోవాలని తహశీల్దార్ వరద కిషోర్ రెడ్డి, ఎంపిడిఒ పరిపూర్ణ అరుంధతి సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వరద కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ మత సామరస్యంతో శాంతి యుతంగా ప్రశాంత వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. ఆవులు,దూడలు,ఒంటెలు వధించడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మటన్ మార్కెట్లో ఆరోగ్యకరమైన, నాణ్యమైన మాంసాన్ని విక్రయించేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్ ఓబులేసుకు సూచించారు. ఈద్గా, మసీదుల వద్ద కోవిడ్ నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి హిమబిందు, ఎఎస్ఐ శ్రీనివాసులు, విఆర్ఒ రాజశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఖాజా

కమిటీకి వ్యతిరేకం కాదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరుటౌన్

అంజుమన్ కమిటీ పెద్దలు ఎన్నికలను తప్పుదోవ పట్టించారని, తాను కమిటికి వ్యతిరేకం కాదని ఆయిల్‌మిల్ ఖాజా పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసి విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంజుమన్ కమిటీ పెద్ద మనుషులు ఎన్నికలను తప్పుదోవ పట్టించారని విమర్శించారు. ఇస్లాంపురం మసీదులో ఎన్నికల ప్రకటన కానీ, ఎన్నికలు కాని జరగలేదని పేర్కొన్నారు. బైలాకు విరుద్ధంగా ఎన్నికలు నిర్వహించారని విమర్శించారు. మూక్తియార్‌ను తాను విమర్శించలేదని కమిటీలోని పెద్ద మనుషులుగా ఉంటూ అంజుమన్ ఆస్తులను స్వలాభాల కోసం అమ్ముకున్న ఇద్దరిని మాత్రమే ప్రశ్నించానని స్పష్టం చేశారు. కమిటీకి చెందిన మోడంపల్లిలో ఉన్న 72 సెంట్లు సలాన్ని, పాఠశాలకు చెందిన స్థలాన్ని గృహ విక్రయ అగ్రిమెంటు ద్వారా స్వలాభం కోసం అమ్ముకున్నారని తెలిపారు. చందాలతో పోగు చేసిన ఆస్తిని అమ్ముకోవడం సరైనదేనా అని ప్రశ్నించారు. ఈ విషయంపై తిరిగి ఎలాంటి ప్రకటనలు చేసినా తాను స్పందిస్తానని ఆయన చెప్పారు.

ఉపకార వేతనానికి విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి- ఖాజీపేట

భార్గవి, వినీల్

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ ప్రతిభ ఉపకార వేతన ఎంపిక పరీక్ష ఫలితాలు ఇటీవల వెలుపడ్డాయి. ఈ ఫలితాలలో మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఉపకార వేతనానికి ఎంపికయ్యారు. రావులపల్లికి చెందిన విద్యార్థి వినీల్ 126 మార్కులతో మండల స్థాయిలో మొదటి ర్యాంకు, జిల్లాలో ఆరో ర్యాంకు సాధించారు. అగ్రహారానికి చెందిన భార్గవి 113 మార్కులతో మండల స్థాయిలో ద్వితీయ స్థానం, జిల్లా స్థాయిలో 21వ స్థానం సాధించినట్లు తల్లిదండ్రులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్థానికులు అభినందించారు.

ప్రతిభ అవార్డుకు ఉషాకిరణ్ విద్యార్థులు..

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

ప్రతిభ అవార్డుకు ఉషాకిరణ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపిక అయినట్లు అ పాఠశాల కరస్పాండెంట్ బి.ఎస్. రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక పాఠశాల ఆవరణంలో ప్రతిభ అవార్డుకు ఎంపికైన పూనేటి తేజేష్, పడమటింటి కేశవానందులను పాఠశాల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఎడాది పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు ఇస్తున్నట్లు చెప్పారు. అలాంటి ప్రతిభ అవార్డులకు ఉషాకిరణ్ ఉన్నత పాఠశాలకు చెందిన పూనేటి తేజేష్, పడమటింటి కేశవానందు అనే ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈనెల 9న కడప నగరంలో జరగనున్న అవార్డుల ప్రదానోత్సవంలో విద్యార్థులకు ప్రముఖులు అవార్డును ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ప్రతిభ అవార్డులకు ఎంపికైన విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నతంగా రాణించాలని కరస్పాండెంట్ ఆకాంక్షించారు. తమ పాఠశాల విద్యార్థులు సాధించిన విజయం పట్ల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

శ్రీచైతన్య విద్యార్థులను వరించిన ప్రతిభ అవార్డులు

పి.గురుభావన, జి.సాయినాథ్

రాష్ట్ర ప్రభుత్వం 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రకటించిన ప్రతిభా అవార్డుకు వేంపల్లెకు చెందిన శ్రీ చైతన్య విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి చెప్పారు. పదోతరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించడంతో జి. సాయినాథ్, పి. గురుభావన అనే ఇద్దరు విద్యార్థులు ప్రతిభ అవార్డుకు ఎంపికైనట్లు జిల్లా అధికారులు ప్రకటించినట్లు చెప్పారు. ఇద్దరు విద్యార్థులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నగదు బహుమతి, ప్రశంసాపత్రం, ట్యాబ్ అందుకొంటారని చెప్పారు. ప్రతి సంవత్సరమూ వేంపల్లె శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభా అవార్డుకు ఎంపిక అవుతున్నట్లు చెప్పారు. తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభా అవార్డుకు ఎంపిక కావడం పట్ల కరపాండెంట్ బి. చక్రపాణి రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్స్ బి.చేతన్ రెడ్డి, బి.చైతన్య రెడ్డి విద్యార్థులను అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ వసతి గృహాలలో ఎసిఎం పిచికారీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకొని, జిల్లా మలేరియా అధికారి మనోరమ ఆదేశాల మేరకు శుక్రవారం పులివెందుల సబ్ యూనిట్ పరిధిలో ఉన్న ప్రభుత్వ వసతి గృహాల్లో దోమల నివారణ చర్యల్లో భాగంగా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో పులివెందుల ప్రభుత్వ బాలికల కళాశాల వసతి గృహంలో, మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలికల పాఠశాల పులివెందుల ఎలసిఎం పిచికారీ చేశారు. హాస్టల్ పరిసరాల్లో దోమలను అరికట్టడానికి, విద్యార్థినులు ఆరోగ్యంగా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా పిచికారీ చేపట్టారు. సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రతి ప్రభుత్వ వసతి గృహంలో పిచికారీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధుల నివారణకు ఇది ఒక ముఖ్యమైన చర్య అని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సోమలింగారెడ్డి, వసతి గృహ సిబ్బంది రమేష్ రెడ్డి, శివమ్మ పాల్గొన్నారు.

పైపులైన్ మార్చండి మహాప్రభో..!

- పైప్‌లీక్‌తో నష్టపోతున్న రైతు
- పట్టని అధికారులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పైప్ లైన్‌లీక్‌తో భూమిని దున్నడానికి వీలు లేకుండా ఉందని, దయచేసి పైప్ లైన్ మార్చండి మహా ప్రభో అని మండల పరిధిలోని ధర్మాపురం గ్రామానికి చెందిన ముక్కమల్ల వెంకట రమణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మైలవరం జలాశయం నుంచి ప్రొద్దుటూరు పట్టణానికి తాగునీరు సరఫరా కోసం మెగాపైప్ లైన్ ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డు వెంబడి వేశారు. కొన్ని సంవత్సరాలు కిందట ధర్మాపురం ఆలయానికి పాలకొవ్వా సెంటర్‌కు మధ్యలో పైప్ లైన్ రోడ్డుకు ఒకవైపు నుంచి మరో వైపుకు హోల్ వేశారు. హోల్ వేసిన ప్రదేశంలో పైప్ లీక్ అయ్యి నీరు అంత పొలంలో నిల్వ ఉండటం వల్ల ముక్కమల్ల వెంకట రమణా రెడ్డి అనే రైతు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆయన ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ వారు వచ్చి సమస్యను పరిశీలించి 10 రోజుల్లో మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. తరువాత నెలలు గడుస్తున్నా పట్టించుకోలేదు. పొలం దున్నదానికి ట్రాక్టర్ వచ్చి మట్టిలో ఇరుక్కుపో తుండటంతో 2 సెంట్ల భూమి తడిగా ఉండి దున్నడానికి వీలు లేకుండా పోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశ్నారు. పంట వేసేటప్పుడు, కోసేటప్పుడు సమస్యలు ఎదుర్కొంటున్నామని పక్క రైతులు చెబుతున్నారు.

మట్టిలో కూరుకుపోయిన ట్రాక్టర్ టైర్ల జాడలు

రమణా రెడ్డి పొలంలో నీరు ఎక్కువైనప్పుడు పక్క పొలాల్లోకి వెళితే వారు ఘర్షణకు వస్తున్నారని చెబుతున్నారు. ఇదే విషయాన్ని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి చేత అధికారులకు ఫోన్ ద్వారా చెప్పించామని, 10 రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పారు. ఇంతవరకు లేదు. వెంటనే ప్రొద్దుటూరు మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని బాధిత రైతు కోరుతున్నారు. లేని సమయంలో కోర్టుకు వెళ్లి నష్టపరిహారం చెల్లించమని వేడుకుంటామని రైతు వెంకట రమణా రెడ్డి తెలుపుతున్నారు.

మార్కెట్ యార్డ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

మార్కెట్ యార్డ్ చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుట్టా

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్, సభ్యుల ప్రమాణస్వీకారం శుక్రవారం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఎల్ఏ పుట్టా సుధాకర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్మన్‌గా టిడిపి నాయకులు ఎపి రవీంద్ర, 12 మంది సభ్యులను మార్కెట్ యార్డ్ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైదుకూరు మార్కెట్ యార్డ్‌ను అన్ని విధాల అభివృద్ధి పరిచేందుకు తన వంతు సహకారం అందిస్తామన్నారు. పశువుల సంత రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. చైర్మన్ రవీంద్ర మాట్లాడుతూ కష్టపడిన కార్యకర్తలకు ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ ఎప్పుడు అండగా ఉంటారని కొనియాడారు. ఎమ్మెల్యే తనపై పెట్టుకున్న నమ్మకానికి తగ్గట్టు పని చేస్తానని, మైదుకూరు మార్కెట్ యార్డును అన్ని విధాల అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి,జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

ఖాజీపేట : మైదుకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎపి రవీంద్ర, ఉప చైర్మన్ నాయబ్ రసూలను ఖాజీపేటకు చెందిన ముస్లిం మైనారిటీ నాయకులు శుక్రవారం మైదుకూరులో ఘనంగా సన్మానించారు. టిడిపి రాష్ట్ర ముస్లిం మైనారిటీ కార్య నిర్వాహ కార్యదర్శి సిద్ధారం ఖదీరుల్లా ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు జాఫర్ ఖలీల్, అబ్దుల్లా, హసీఫ్, కౌశిక్, ఆశిక్ పాల్గొన్నారు.

ఆస్పత్రి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వరద రాజుల రెడ్డి

లక్ష్య సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు టౌన్

స్థానిక నెహ్రూ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసి లక్ష్య సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిని ఎమ్మెల్యే వరద రాజుల రెడ్డి శుక్రవారం ఉదయం ప్రారంభించారు. అనంతరం డాక్టర్ పాతకోట శ్రీనాథ్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 12 సంవత్సరాల నుండి కార్డియాలాజీ, అస్తమాలజీ విభాగంలో సేవలు అందిస్తున్నామని, మమ్మల్ని ఆదరించి అభివృద్ధి సహకరించిన ప్రొద్దుటూరు, జిల్లా ప్రజలకు రుణపడి ఉంటామని తెలిపారు. నూతనం గా ఏర్పాటు చేసిన లక్ష్య సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఎమర్జెన్సీ, క్యాజువలిటీ, ఐసి యు తో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గుండె సంబంధిత వ్యాధులకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని సౌకర్యాలతో మల్టీ స్పెషలిటీ హాస్పిటల్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి, డాక్టర్ హరిత, కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ అన్నవరం రాంమోహన్ రెడ్డి, అసం రఘు రామి రెడ్డి, కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్ బాషా పాల్గొన్నారు.

పిల్లర్లను తొలగించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని పతంగి రామన్నరావు క్రీడా మైదానంలో అనవసరంగా ఉన్న పిల్లర్లను తొలగించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. శుక్రవారం క్రీడా మైదానంలో పిల్లర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ శతాబ్ది చరిత్ర కలిగిన క్రీడా మైదానాన్ని అధికారులు పట్టించుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. గతంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించిన ఘనత క్రీడా మైదానానికి ఉందన్నారు. రానురాను క్రీడా మైదానాన్ని పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. పట్టణం నడిబొడ్డున ఇంత ఆట స్థలం జిల్లాలో ఎక్కడా లేదన్నారు. ఎంతో మంది క్రీడా కారులకు ఎదుగుదలను ఉపయోగపడుతుందని చెప్పారు. క్రీడా మైదానంలో ఆటలకు అడ్డుగా పిల్లర్లు దర్శనం ఇస్తున్నాయన్నారు. వీటి వల్ల ఎటువంటి ఉపయెగం లేదన్నారు. కనీసం ఇండోర్ ఆటలకు అయినా ఉపయోగంలోకి తీసుకోనిరావాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య, పట్టణ ఉపాధ్యక్షులు సుబహాన్ పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న గండిరోడ్డు, పుల్లయ్యతోట వీధి ప్రాంతాలకు సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు చొరవతో వాటర్ ట్యాంకులు ద్వారా మంచి నీటిని సరఫరా చేశారు. పాపాఘ్ని నది నుండి ఆయా ప్రాంతాలకు పైపులైన్ ద్వారా మంచినీటి సరఫరా అవుతున్న క్రమంలో పైపులైను పగిలిపోయింది. దీంతో ఆయా ప్రాంతాలకు మంచినీటి సరఫరా ఆగిపోయింది. విషయాన్ని ఆయా ప్రాంతాల ప్రజలు సర్పంచి దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి ఆయన శుక్రవారం వాటర్ ట్యాంకర్లు ద్వారా నీటిని సరఫరా చేయించారు. మంచినీటి సమస్యను పరిష్కరించినందుకు సర్పంచ్‌కుప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పారిశుధ్యం , డ్రెయినేజీ, వీధిలైట్లు, మంచినీటి తదితర సమస్యలు ఉంటే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎక్కడా కూడా మంచినీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

పిల్లల భవిష్యత్తుకు పునాది ఫ్యూచర్ ప్రీ స్కూల్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేస్తుందని ఫ్యూచర్ ఆన్ ప్రీ స్కూల్ చైర్మన్ సురేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని తాడిపత్రి రోడ్డులో ఫ్యూచర్ ప్రీ స్కూల్‌ను టిడిపి ఇన్‌ఛార్జి సి.భూపేష్ సుబ్బరామి రెడ్డిచే ప్రారంభించారు. ముందుకు భూపేష్ సుబ్బరామి రెడ్డి మాట్లాడుతూ పిల్లల ఫ్యూచర్ కోసం నూతనంగా ఏర్పాటు చేసిన ప్రీ పాఠశాల విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఉన్నత ప్రమాణాలు ఉంటే తల్లిదండ్రులు కచ్చితంగా ఆదరిస్తారన్నారు. చిన్న వయస్సు నుండే విద్యతో పాటు నైతిక విలువలు నేర్పాలన్నారు. అనంతరం చైర్మన్ సురేష్ మాట్లాడుతూ పట్టణంలో స్టేట్ బ్యాంక్ పక్కన ఎస్‌పి డిగ్రీ కళాశాల ఆవరణంలో మంచి వాతావరణంలో పాఠశాలను ప్రారంభించమన్నారు. తల్లిదండ్రులు, విద్యావంతులు, మేధావులు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ హాస్టల్ వార్డెన్ రవిశంకర్ రెడ్డి, ఎస్‌పి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పాల నాగేశ్వర రెడ్డి, కాంట్రాక్టర్ అందె జగన్ మోహన్ రెడ్డి, పాల్గొన్నారు.

పాఠశాలను ప్రారంభిస్తున్న భూపేష్‌రెడ్డి

ప్రమాదాలు జరిగినా స్పందించరా..!

బిధినంచర్ల వద్ద తరచూ ప్రమాదాలు - పట్టని అధికారులు

ప్రమాదాలకు నిలయంగా మారిన ఆర్‌అండ్‌బి రోడ్డు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని సింహాద్రిపురం బి. వెలిదండ్ల ప్రధాన రహదారిలో తరచూ రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంటుంది. ఆర్ అండ్ బి పరిధిలోని బిధినంచర్ల వద్ద సిమెంట్ రోడ్డు నుంచి తారు రోడ్డు ప్రారంభంలో రోడ్డుపైన నీరు నిల్వ సమస్య కొనేళ్లుగా పరిష్కారం కాకపోవడంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో అనేకమార్లు గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకు వచ్చినప్పటికీ ఏమాత్రం స్పందించిన దాఖలాలు లేవు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లలోని మురుగు నీరు అంతా అక్కడికొచ్చి చేరుతున్నది. దీని కారణంగా నీరు నిల్వ ఉండి రోడ్డు గుంతల మయం అయ్యింది.

మహిళా ఉద్యోగికి తీవ్ర గాయాలు...

వెలిదండ్ల నుంచి సింహాద్రి పురానికి విధుల నిర్వహణ నిమిత్తం స్కూటీపై వస్తున్న ఓ మహిళా ఉద్యోగి ఇటీవల ఈ ప్రాంతంలో కిందపడి తీవ్రంగా గాయపడింది. మోటర్ బైక్ దారులు అనేకమార్లు ఇక్కడే కింద పడ్డారు. గుంతలమై ఉన్న రోడ్డులో నీరు నిల్వ ఉండడంతో అదుపుతప్పి కింద పడుతున్నారు. ఇటీవల కారుకు కింది భాగంలో ఇంజన్ సిసి రోడ్డుకి తగిలి మరమ్మతులకు గురైంది. దీంతో బాధిత ఓనరు లబోదిబోమంటూ అధికారుల తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు...

వైద్యశాఖ, పంచాయతీ, ఆర్‌అండ్‌బి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల తీరుపై తీవ్ర వినిపిస్తున్నాయి. వైద్య శాఖ, పంచాయతీ అధికారులు మురుగు నీరు ఇళ్లల్లో నుంచి బయటకు రోడ్డుపైకి రానికుండా అవగాహన కల్పించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రాంతంలో ప్రమాదం జరిగి చచ్చిపోతే గాని స్పందించరా అంటూ వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని వాహనదారులు, పాదాచారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

రసాయనిక ఎరువుల వాడకం వద్దు

ప్రజాశక్తి -చాపాడు

రసాయనిక ఎరువుల వినియోగంతో భూసార క్షీణత ఏర్పడుతుందని వనిపెంట కెవికె ప్రధాన శాస్త్రవేత్త బాలకృష్ణ తెలిపారు. మండలంలోని చియ్యపాడు, మెర్రాయపల్లె, అల్లాడుపల్లె గ్రామాలలో శుక్రవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమైన పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. సేంద్రియ ఎరువులను ఉపయోగించాలన్నారు. విత్తనశుద్ధి, వేసవిలో లోతైన దుక్కులు, సమగ్ర సస్యరక్షణ చర్యలు, రసాయనిక ఎరువుల వినియోగం మొదలైన విషయాల పట్ల రైతులకు అవగాహన కల్పించారు. చిరుధాన్యాల ఆవశ్యకత, యాజమాన్య పద్ధతుల గురించి జాతీయ చిరుధాన్యాల సంస్థ శాస్త్రవేత్తలు బి. సుబ్బరాయుడు, ఎ.వి ఉమాకాంత్ వివరించారు. పశు పోషణ గురించి డాక్టర్ విజయకుమార్ రైతులకు అవగాహన కల్పించారు కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు మండల వ్యవసాధికారి మ్యాగీ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రెడిట్ సొసైటీలో సభ్యులుగా చేరండి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీలో జిల్లాలోని బ్రాహ్మణులందరు సభ్యత్వం తీసుకోవాలని కడప జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పి.వి.ఎస్.వి ప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. క్రెడిట్ సొసైటీలో సభ్యులుగా చేరితే బ్రాహ్మణులకు ఎన్నో లాభాలు ఉన్నాయని చెప్పారు. సభ్యులుగా చేరిన వారికి ముగ్గురికి గ్రూపులో రుణాలు మంజూరు చేస్తారని చెప్పారు. బ్యాంకుల కంటే తక్కువ వడ్డీతో రుణాలు అందజేస్తారని చెప్పారు. వ్యక్తిగత రుణాలు తీసుకొనే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. వ్యాపారం కోసం మొదటి సారి రూ 2 లక్షల వరకు రుణాలు పొందవచ్చని అన్నారు. బ్యాంకుల్లో తీసుకొనే వడ్డీ కంటే తక్కువ కాబట్టి అవకాశాన్ని బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సభ్యత్వం ఉంటేనే రుణాలు ఇస్తారని చెప్పారు. క్రెడిట్ సొసైటీలో 18వ ఏళ్ళ నుండి 60 సంవత్సరాల వరకు సభ్యత్వం పొందవచ్చని అన్నారు. సభ్యత్వం ఉన్న వ్యక్తులు ఆకస్మికంగా మరణిస్తే సొసైటీ రూ 50,000 ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. రూ.600 చెల్లించి సభ్యత్వం తీసుకొంటే రూ.100 మెంబరు షిప్ కోసం తీసుకోని రూ.500 డిపాజిట్ గా పెట్టు కొంటారని చెప్పారు. సభ్యత్వం వద్దని అనుకొన్నప్పుడు రూ.500 తిరిగి ఇస్తారని తెలిపారు. ఇప్పటికే సభ్యత్వం తీసుకోకుండా ఉన్న వారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న రిటైర్డ్ హెచ్‌ఎం వెంకట్రామిరెడ్డి

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పాతపేటలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ఘనంగా ముగిశాయి. వివిధ రకాల ఆట పోటీలలో ప్రతిభ సాధించిన విద్యార్థులకు శుక్రవారం విశ్రాంతి ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి చేతులమీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆ శాఖ గ్రంథాలయ అధికారి వనజా కుమారి మాట్లాడుతూ ఏప్రిల్ 28 నుండి జూన్ 6 వరకు 40 రోజులపాటు గ్రంథాలయంలో నిర్వహించిన వేసవిజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. వేసవి సెలవుల్లో టీవీలు, సెల్ ఫోన్లు వాడడం వల్ల ఎన్నో అనార్థాలకు దారి తీస్తాయని అన్నారు. గ్రంథాలయాల్లో పఠనం చేయడం వల్ల విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు అన్నారు. సమయం ఉన్నప్పుడు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేయాలని కోరారు. పోటీ పరీక్షలకు చెందిన రక రకాల పుస్తకాలు గ్రంథాలయంలో విద్యార్థులకు, నిరుద్యోగులకు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న రాజశేఖరరెడ్డి

మైదుకూరు పట్టణంలోని కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల్లో పుస్తకాల పేరుతో పాఠశాలలు వ్యాపారం చేస్తున్నారని ముందస్తు అక్రమ అడ్మిషన్ చేసి పాఠ్య పుస్తకాలు అమ్ము తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖరరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అభినయ్ కుమార్, ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులను ఫోన్లో పరామర్శించిన మాజీ సిఎం

ప్రజాశక్తి ఖాజీపేట

మండల పరిధిలోని దుంపలగట్టుకు చెందిన రెడ్యం నారాయణరెడ్డిపై పోలీసులు అక్రమంగా గంజాయి కేసు బనాయించారన్న అవమాన భారం తట్టుకోలేక గురువారం విద్యుత్ తీగలు పట్టుకొని బలవన్మరణానికి పాల్పడిన విషయం పాఠకులకు విధితమే. ఈ విషయమై శుక్రవారం మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి దుంపలగట్టు గ్రామానికి వెళ్లి మృతుని భార్య సుభాషిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైసిపి బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డితో ఫోన్లో బాధిత కుటుంబ సభ్యులను మాట్లాడించారు. తమ కుటుంబానికి అండగా ఉంటామని, జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు తాను తప్పక కలుస్తానని మాజీ జగన్ ఫోన్లో భాధిత కుటుంబ సభ్యులకు తెలిపారు.

పిల్లల్ని కనండని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె : ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న వారు ఎక్కువ మంది పిల్లల్ని కని జనాభా పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదేపదే చెప్పడం విడ్డూరం, హాస్యాస్పదమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచంలో 242 దేశాలున్నాయని, ప్రపంచ జనాభా 809 కోట్లని, ఇందులో మన దేశ జనాభా 144 కోట్లని అన్నారు. చైనా జనాభా 142 కోట్లు కాగా. అమెరికా జనాభా 34 కోట్లు మాత్రమే అన్నారు. ఇప్పటికే చైనాను దాటి నెంబఃర్ వన్ స్థానంలో మన దేశం ఉన్నట్లు చెప్పారు. ప్రపంచ జనాభాలో మన జనాభా 18 శాతం కాగా ప్రపంచ విస్తీర్ణంలో భారత్ విస్తీర్ణం 2.4 శాతం మాత్రమే అన్నారు. జన సాంద్రత (చదరపు కిలోమీటర్ కు జనాభా) విషయంలో కూడా మన దేశంలో ఎక్కువ అన్నారు. ప్రపంచ సరాసరి 55 మంది కాగా భారత్‌లో 488, చైనాలో 151, అమెరికాలో 38, రష్యాలో 9 మంది ఉండడం గమనార్హం అన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగాలు లేవ న్నారు. మద్యం, డ్రగ్స్, గంజాయికి యువత బానిసలై సంఘ వ్యతిరేక శక్తులుగా తయారై తల్లి దండ్రులకు భారం అవుతున్నట్లు చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా స్థానికులకే ఉద్యోగాలు, ఉపాధి అన్న భావన రోజు రోజుకూ పెరిగిపోతున్నట్లు చెప్పారు. అమెరికా, తదితర దేశాలలో ఉన్న ప్రవాస భారతీయులు ఉద్యోగాలు, ఉపాధి వదులుకొని దేశానికి తిరిగి వచ్చే పరిస్థితులు ఉన్నట్లు చెప్పారు.